క్లుప్తంగా

నేడు ముత్యాలమ్మ జాతర



చలువ పందిళ్లతో ఆలయ ప్రాంగణం

నరసాపురం రూరల్: మొగల్తూరులోని నడివీధి ముత్యాలమ్మ వారి జాతరను ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఘటాలకు పూజలు నిర్వహించి అనంతరం దర్శనం కల్పిస్తారు. పూజలు అనంతరం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకు జాతర నిర్వహించి అమ్మవారిని సాగనంపుతారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ నాడు ముక్కనము వెళ్లిన మరసటి బుధవారం లేదా ఆదివారం రోజున అమ్మవారు జాతరను నిర్వహించడం ఆనవాయితీ. జాతర నేపథ్యంలో అమ్మవారి ఘటాలను ఉంచే పూరిపాక పరిసరాలను విద్యుత్ దీపాలంకరణ, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వర స్వామి

నరసాపురం రూరల్: మండలంలోని కాపుల కొడప వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమారాచార్యులు స్వామి వారిని వైభవ వేంకటేశ్వర స్వామిగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. దర్శనానంతరం దాతల ఆర్థిక సహకారంతో ఆలయ ఆవరణలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నాప్రగడ చక్రధరరావు, కొండేటి రామకృష్ణారావు, అడ్డాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యతను రూపుమాపాలి



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మూర్తి

పెనుగొండ: నిరక్షరాస్యతను రూపు మాపడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పెనుగొండ ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో నిరక్షరాస్యులకు ఉపయోగపడేలా ఈ-ఉల్లాస్‌పై అవగాహనకు వీఓఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీఎం టి.పుష్పావతి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులకు సాంకేతిక విద్య, క్రియాత్మక విద్య, ఆర్థిక విద్య అభ్యాసులకు నేర్పించడానికి వీఓఏలుగా పని చేస్తున్న వారిని వలంటీర్లుగా ఎంపిక చేసేందుకు ఈ శిక్షణనిచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, వెలుగు సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.

శివాలయంలో రంగస్థలం నటుడు మహేష్ పూజలు



శివదేవునిచిక్కాల శివాలయంలో పూజలు చేస్తున్న నటుడు మహేష్

పాలకొల్లు అర్బన్: ప్రముఖ సినీ నటుడు, రంగస్థలం మహేష్ సోమవారం మండలంలోని శివదేవునిచిక్కాల శివాలయంలో సందడి చేశారు. శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి ఆలయంలో ఆయన మొక్కునాటారు. అలాగే ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సిద్ధాంతి ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి)ని ప్రత్యేకంగా కలుసుకుని ఆశీర్వచనాలు పొందారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పెనుమంట్ర హైస్కూల్ వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

పెనుమంట్ర: నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశానికి విద్యార్థులకు పెనుమంట్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. పెనుమంట్ర, అత్తిలి, పెనుగొండ, ఇరగవరం మండలాలకు చెందిన 221 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పరిశీలకుడు, ఆలమూరు హైస్కూల్ హెచ్ఎం బి.సుబ్బారావు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షను నిర్వహించినట్లు వివరించారు.

సచివాలయ సిబ్బందిపై ఆంక్షల కత్తి

- హాజరు నిబంధనల సవరణ
- ఆవేదన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



నారినమెరక సచివాలయ భవనం

యలమంచిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం విషం చిమ్ముతుంది. ఇప్పటికే వలంటీర్లను పక్కకు పెట్టేసిన కూటమి సర్కార్ సచివాలయ ఉద్యోగస్తులను నిబంధనల పేరుతో వేధిస్తుంది. తాజాగా సచివాలయ సిబ్బందిపై ప్రభుత్వం కొత్త ఆంక్షలు విధించింది. కచ్చితంగా రెండుసార్లు బయోమెట్రిక్ హాజరువేయాలని, ఐడెంటీ కార్డులు ధరించి విధులకు హాజరు కావాలని, పింఛన్ లబ్ధిదారులకు వారింటికి 300 మీటర్ల రేడియస్‌లోనే పింఛన్ ఇవ్వాలని నిబందనలు విధించింది. వీటిపై సచివాలయ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులకు ఇంతవరకు ఉన్న హాజరు నిబంధనలను సవరించి కొత్త నిబంధనలు ప్రకటించింది. గతంలో బయోమెట్రిక్ విధానంలో మూడుసార్లు హాజరు వేయాల్సి ఉన్నా ఉద్యోగుల సౌలభ్యం దృష్ట్యా ఒక్కసారి బయోమెట్రిక్ వేసినా సరిపోయేది. ఒక్క బయోమెట్రిక్ హాజరు ఉన్నా ఆ రోజు పని చేసినట్లుగా పరిగణించేవారు. ప్రభుత్వం ఇప్పుడు బయోమెట్రిక్ హాజరును సవరించి రెండుసార్లు వేసేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసింది. అయితే కచ్చితంగా ఉద్యోగులు రెండుసార్లూ బయోమెట్రిక్ వేయాల్సిందేనని మెలిక పెట్టింది. ఉదయం వేసి సాయంత్రం వేయకపోతే ఆ రోజు సాధారణ సెలవుగా పరిగణిస్తారు. ఈ మేరకు యాప్‌లో కొన్ని మార్పులు చేసింది. డీఎస్‌డబ్ల్యూఎస్ హాజరు యాప్ వెర్షన్ 2.2లో ఉదయం 10:30 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే హాజరు తీసుకుంటుంది. రోజుకు రెండుసార్లు బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారిత హాజరువేయాల్సి ఉంటుంది. ఎవరైనా ఉద్యోగి ఉదయం ఒకసారి హాజరు నమోదు చేసి, సాయంత్రం వేయకపోతే అది ఆ రోజు పని చేయనట్లే లెక్కగా పరిగణిస్తారు. హాజరు లెక్కను ఖజానా శాఖకు అనుసంధానం చేశారు. రెండుసార్లు హాజరు వేస్తేనే జీతం వచ్చేలా లింకు పెట్టారని సచివాలయ ఉద్యోగస్తులు వాపోతున్నారు.

పింఛన్ల పంపిణీ నిబంధనలపై ఆక్షేపణ

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థ రద్దుచేసి సచివాలయ ఉద్యోగులతోనే పింఛన్ పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే లబ్ధిదారునికి ఇంటికి 300 మీటర్లలోనే పింఛన్ పంపిణీచేయాలనే కొత్తగా ఆంక్షలు విధించడంపై సచివాలయ సిబ్బంది ఆక్షేపణ వ్యక్తంచేస్తున్నారు. ఒక్కో సారి లబ్ధిదారుడు అనారోగ్యం రీత్యా వేరే గ్రామంలో ఉన్నా అక్కడకు వెళ్లి పింఛన్ ఇస్తున్నామని, ఇప్పుడు 300 మీటర్లలోనే పింఛన్ ఇవ్వాలంటే ఎలా కుదురుతుందని సచివాలయ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఈ నిబందనవల్ల లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని వారు ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు

మండలం	సచివాలయాలు
పాలకొల్లు పట్టణం	14
పాలకొల్లు	22
యలమంచిలి	23
పోడూరు	17
సచివాలయ ఉద్యోగస్తులు	730

సచివాలయ సిబ్బంది ఆవేదన

కూటమి ప్రభుత్వం పెట్టిన కొత్త ఆంక్షలపై సచివాలయ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మామూలు సమయంలో రెండుసార్లు హాజరు వేయడానికి తమకు ఇబ్బంది లేదని, అయితే ఒక్కోసారి వరదలు, ప్రకృతి విపత్తులు వంటి సమయంలో వేరే గ్రామంలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని చెబుతున్నారు. అలాంటి సమయంలో మళ్లీ పనిచేసే ప్రదేశానికి వచ్చి హాజరు వేయడం కష్టమవుతుందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు ఎవరికీ లేని విధంగా సచివాలయ ఉద్యోగులు ఐడెంటీ కార్డు ధరించి విధులకు హాజరవ్వాలని నిబంధన పెట్టడంపై కూడా ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత



బాధితులకు సహాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: మండలంలోని వడ్డిలంక గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కామన మారియ్య-నాగమణి, కామన నాగేశ్వరరావు-దుర్గాభవాని ఇతర కుటుంబ సభ్యులను శనివారం వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఓదార్చారు. అనంతరం తనవంతు సహాయంగా బాధితులకు బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, లుంగీ, టవల్స్, చీరలు, రూ. 2000 నగదు అందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్ పొన్నమండ నాగరాజు, నారినమెరక ఎంపీటీసీ సభ్యుడు ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, పార్టీ నాయకులు ఆరుమిల్లి లక్ష్మణరావు, పొన్నమండ ముత్యాలరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, ఉచ్చుల స్టాలిన్, మోకా ప్రేమ్‌చంద్, లంక చిరంజీవి, జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వెంకటేశ్వరరావు, చెన్ను విజయ్, గంటా నరేష్, పాలపర్తి కృపానందం తదితరులు పాల్గొన్నారు.

● ఆపే దమ్ము లేదా?



లక్ష్మణేశ్వరంలో జాగ్రత్తలు తీసుకోకుండా తారు రోడ్డుపై దమ్ము ట్రాక్టర్ వెళ్తున్న దృశ్యం

కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారులు కొంతమంది ట్రాక్టర్ల డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ఛిద్రంగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు అంతంత మాత్రంగానే ఉంటుంటే దమ్ము ట్రాక్టర్ల వల్ల బాగున్న రోడ్లు సైతం ఛిద్రమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులెవరూ చర్యలు చేపట్టకపోవడంతో దమ్ము ట్రాక్టర్‌లు విచ్చలవిడిగా రహదారులపై ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కూడా ఈ పరిస్థితికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దమ్ము ట్రాక్టర్ల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - నరసాపురం రూరల్

గ్రామాల్లో రీ-సర్వే పక్కాగా నిర్వహించాలి



స్టీమర్‌రోడ్డులో సెంటర్‌లో రోడ్డు ఊడుస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

నరసాపురం: ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేపై అవగాహన పెంచుకుని రీసర్వే పక్కాగా జరపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం వైఎస్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో రీసర్వేపై నరసాపురం డివిజన్‌లోని తహసీల్దార్లు, సర్వే అధికారులు, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు ఇతర సంబంధిత అధికారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ముందుగా అవగాహన కల్పించుకుని రీసర్వే పనులు చేపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రికార్డులు పరదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. గ్రామ సరిహద్దులను కచ్చితంగా పాటించాలని చెప్పారు. ప్రభుత్వ భూములకు సంబంధించి ఇరిగేషన్, డ్రెయినేజీ, దేవస్థానం భూములు, జిల్లా పరిషత్ తదితర భూములకు ముందుగా నోటీసులు అందించాలని పేర్కొన్నారు. రైతుల ఆధ్వర్యంలో వారి సమక్షంలోనే సర్వే చేయాలని లేదంటే ఇబ్బందులు వస్తాయని చెప్పారు. సమావేశంలో నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, జిల్లా సర్వే అధికారి కె.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎన్‌వీఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలి



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. శనివారం నరసాపురం మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆయన స్టీమర్ రోడ్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా కొంతదూరం స్వయంగా చీపురుపట్టి రెవెన్యూ, మున్సిపల్, వివిధ శాఖల ఉద్యోగులతో కలిసి రోడ్లు శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత విషయంలో ప్లాస్టిక్ పెద్ద అవరోధంగా మారిందన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ నియంత్రణకు కలిసి రావాలన్నారు. ఇక నుంచి ప్రతి మూడో శనివారం ప్రతి పల్లెనూ, ప్రతి పట్టణంలోనూ స్వచ్ఛ ఆంధ్ర పేరున కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. నరసాపురం ఆర్డీఓ దాసి రాజు మాట్లాడుతూ 45 రోజుల్లో నరసాపురం మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలించేలా యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నసమారాధన

నరసాపురం రూరల్: మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో ఉన్న బందరు మొగదారమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి పండుగ నేపథ్యంలో అమ్మవారి జాతర మహోత్సవాలను వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించి అనంతరం అన్న సమారాధనను నిర్వహిస్తున్నామని వివరించారు.

బెల్ట్ షాపు నిర్వాహకుల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: వేల్పూరు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి మద్యం బెల్ట్ షాపుల నిర్వాహకులు ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్య లక్ష్మి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మోదుగగుంట, పెంటపాడు మండలం దర్శిపర్రులో నిర్వహించి 22 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం పంపిణీ



పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి శనివారం యూనిఫాం పంపిణీ చేశారు. మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి పారిశుద్ధ్య కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు, వాటర్ వర్క్స్ సిబ్బందికి యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు పాల్గొన్నారు.

గురుస్వామి మోహన్ మృతి



పెనుగొండ: పెనుగొండ అయ్యప్ప స్వామి పెదపీఠం గురుస్వామి నౌబత్తు కృష్ణమోహన్(53 నల్ల మోహన్) ఆకస్మికంగా మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. అయ్యప్ప పడి పూజలు కేరళ తాంత్రిక మంత్రాలతో ప్రత్యేక హారతినిచ్చే గురుస్వామిగా ఉభయగోదావరి జిల్లాల్లో మోహన్ ప్రసిద్ధి చెందారు. మోహన్ మృతిపై సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, గురుభవానీ నక్క వేద వ్యాస శాస్త్రి, గురుభవానీ పిల్లి శంకరం, గురుస్వాములు బ్యాంకు శ్రీను, బందారు నాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

హోటళ్లలో గ్యాస్ సిలిండర్ల సీజ్

భీమవరం (ప్రకాశంచౌక్): గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఆయన భీమవరం పట్టణంలోని 11 హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వీటిలోని 8 హోటళ్లలో 37 సిలిండర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశామని జేసీ తెలిపారు.

ఉత్సాహంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్



పాలకొల్లు అర్బన్: అరట్లకట్ట అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీహెచ్ ఇందిర



నరసాపురం రూరల్: మొగల్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



పెనుగొండ: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



యలమంచిలి: కాజ పడమరలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మహ్మద్ హసీనా

పాలకొల్లు అర్బన్: ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర కోరారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరట్లకట్ట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులతో కలిసి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం సీడీపీఓ ఇందిర తల్లులతో, గర్భిణులతోనూ, బాలింతలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సేంద్రీయ విధానంలో పోషక వాటికలో పెంచిన ఆకుకూరలను గర్భిణులకు, బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి, అంగన్‌వాడీ వర్కర్ సత్యవతి పాల్గొన్నారు.

మొగల్తూరులో..

నరసాపురం రూరల్: గ్రామాల అభివృద్ధికి, సంపూర్ణ పారిశుద్ధ్యానికి సహకరించాలని డీఎల్‌పీఓ జ్యోతిర్మయి కోరారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొగల్తూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా అందించాలన్నారు. గ్రామంలో చెత్తను తొలగించి పరిశుభ్రతను మెరుగుపర్చేలా చేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీగా గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా వెళ్లి స్థానిక రిలయన్స్ మార్ట్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు గంటా సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ప్రజలందరూ స్వచ్ఛ ఆంధ్రాకు సహకరించాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి అన్నారు. శనివారం పెనుగొండలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేసి పెనుగొండలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.రత్నాకరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: అపరిశుభ్ర చేతులతో ఆహారాన్ని తీసుకుని రోగాలను ఒంట్లోకి ఆహ్వానించ వద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కాజ పడమర గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత ఉత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆహారాన్ని తీసుకునే ముందు మల, మూత్ర విసర్జన తరువాత తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడుక్కోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల వేణుగోపాలస్వామి (వేణు), ఎంపీటీసీ సభ్యుడు జిల్లెళ్ల రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.